www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 2 జనవరి 2024
5
అన్నమయ్య



ఘనంగా కోరేగావ్ విజయోత్సవ దివస్

ప్రజాశక్తి-మదనపల్లి : విసికె పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివ ప్రసాద్ ఆధ్వర్యంలో 206వ భీమా కోరేగావ్ విజయోత్సవ దివస్‌ను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1818 జనవరి 1న పూణే సమీపంలోని భీమా కోరేగావ్‌లో పెషా వాలపై మహర్ రెజిమెంట్ విజయం సాధించడం ద్వారా మన నిజమైన విముక్తి ప్రారంభమైందని చెప్పవచ్చని పేర్కొన్నారు. అది పెషావాలకు, బ్రిటిష్ సైన్యానికి మధ్య జరిగిన చిన్న యుద్ధమే అయినా అది మలుపు తిరిగిందన్నారు. ఈ యుద్ధం ద్వారా అప్పటి అంటరాని వర్గాల విముక్తి కోసం 500 మంది మహర్ సైనికులు పెషావాల శక్తివంతమైన సైన్యాన్ని ఓడించారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సైనికుడి కుమారుడైనందున ఈ యుద్ధం గురించి ఆయనకు బాగా తెలుసని, నివాళులు అర్పించడానికి తరచూ ఈ ప్రదేశాన్ని సందర్శించేవారన్నారు. మహర్ యుద్ధంలో అమరవీరుల గౌరవార్థం భీమా కోరేగావ్‌లోని యుద్ధ స్మారక చిహ్నంపై చెక్కబడిన అమరవీరులకు. కార్యక్రమంలో భారతీయ అంబేద్కర్ సేన గౌరవాధ్యక్షులు ప్రజా కవి రెడ్డప్ప, లక్ష్మీనారాయణ, ముని వెంకటప్ప, ముత్యాల మోహన్, ఇసుకనూతపల్లి రమణ, రవిశంకర్, మీసాలు గంగులన్న, సోనికంటి రెడ్డప్ప, జన, గంగాధర్, వ్యాపారవేత్త శ్రీనివాసులు, మదనమోహన్ పాల్గొన్నారు.

పొర్లుదండాలు పెడుతూ నిరసన

- కోలాటం ఆడుతూ వినూత్నంగా ఆందోళన
- 21వ రోజూ కొనసాగిన సమ్మె

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ అన్నమయ్య జిల్లాలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం నాటికి 21వ రోజుకు చేరుకుంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఐసిడిఎస్, తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల ఎదుట అంగన్వాడీలు పెద్ద ఎత్తున ఆందోళనలు కొనసాగిస్తున్నారు. కోలాటాలు ఆడుతూ, పొర్లుదండాలు పెడుతూ వినూత్నంగా నిరసన తెలియజేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంగన్వాడీలు మాత్రం సమస్యలు పరిష్కారమయ్యే వరకూ సమ్మె విరమించేది లేదంటూ నినాదాలు చేశారు. అంగన్వాడీల సమ్మెకు పార్టీలు, ప్రజలు, ప్రజా సంఘాల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తోంది.



రాయచోటి : కోలాటం చేస్తూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

సమస్యలు పరిష్కరించేంతవరకు సమ్మె ఆపే ప్రసక్తే లేదని అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దొమ్మరాజు భాగ్యలక్ష్మి, ప్రాజెక్టు అధ్యక్షులు వి.సిద్ధమ్మ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా భాగంగా సోమవారం రాయచోటి లోని కలెక్టరేట్ ఎదుట సాంస్కృతిక కార్యక్రమాల, కోలాటల ద్వారా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీల సమ్మె 21వ రోజుకు చేరిందని, అయినా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేతనాల పెంపు, గ్రాట్యూటీ అమలు తదితర విషయాల్లో ప్రభుత్వం నోరు మెదపలేదన్నారు. గతంలో జరిగిన చర్చల్లో మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తామని అంగీకరించారని, ఇప్పటి వరకు దీనికి సంబంధించిన జిఒ ఇవ్వలేదని పేర్కొన్నారు. అంగన్వాడీ గ్రేడ్-2 సూపర్వైజర్ 560 పోస్టులు ఇచ్చామని మంత్రి ఉషశ్రీ చరణ్ అబద్ధాలు ఆడుతున్నారన్నారు. తమ సమ్మెకు లబ్దిదారుల నుంచి అపూర్వ మద్దతు లభిస్తుందని చెప్పారు. అంగన్వాడీ కేంద్రాలను తెరవాలని ప్రభుత్వం నాలుగు శాఖలతో తలకిందులుగా తపస్సు చేసిందన్నారు. ఇప్పటి వరకు ఒక్క పిల్లాడికి కూడా సరైన తిండి పెట్టలేకపోయిందన్నారు. ప్రభుత్వం అద్దెలు ఇవ్వకపోయినా గర్భిణులు, బాలింతలకు పోషణ అందించామన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. తమ ఆందోళనలకు రాజకీయ పార్టీలు, కార్మిక, ప్రజా సంఘాలు, లౌకిక ప్రజాతంత్ర వాదులు, ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ లీడర్లు అనసూయమ్మ, కవిత, పద్మజ, జయ, ఉమాదేవి, లక్ష్మీదేవి, విజయమ్మ, రామంజులమ్మ, నాగమణి, సుమలత, ప్రవీణ, సబీనా, రమీజా, ఇందిరమ్మ పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు ఐసిడిఎస్ కార్యాలయం వద్ద పొర్లు దండాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ మాట్లాడుతూ నూతన సంవత్సరంలో సైతం కుటుంబాలను వదిలి మహిళలు రోడ్డులెక్కుతున్నారంటే ఇది కేవలం జగన్మోహన్‌రెడ్డి పుణ్యమేనన్నారు. ప్రభుత్వానికి కనువిప్పు కలిగి అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీలు ఈశ్వరమ్మ, విజయ, శివరంజని, అమరావతి, సరోజిని, విజయ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. **మదనపల్లి:** స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి నిరసన కార్యక్రమాన్ని అంగన్వాడీ కార్యకర్తలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మధురవాణి, రాజేశ్వరి, ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ 21 రోజులుగా అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిరవధిక సమ్మెను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గౌరీ, కరుణ, స్వారూపా, భూకైలేశ్వరి, అమ్మాజీ, విజయ, అఖిరున్నిసా, భాగ్య, గీతా సుజాని, శ్రీవాణి, ఈశ్వరి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** అంగన్వాడీలు తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగిస్తున్నారు. ఆటపాటలతో వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనం అమలు, గ్రాట్యూటీ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీలు, ఆయాలు పాల్గొన్నారు. **సుండుపల్లి :** అంగన్వాడీలు నిర్వహిస్తున్న సమ్మెపై అధికారులు స్పందించాలని యూనియన్ నాయకులు నాగేశ్వరి పేర్కొన్నారు. సోమవారం అంగన్వాడీలు ఎస్ఐ రామకృష్ణారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమ్మెలోకి వెళ్లి 21 రోజులు అవుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం దిగివచ్చేంత వరకు నిరసన కొనసాగిస్తామని తెలిపారు. తాము చేసే పనులను సచివాలయ ఉద్యోగులచే చేయించడం ఎంతవరకు సమంజషమని ప్రశ్నించారు. తమ సమస్యలను విస్మరిస్తే ప్రభుత్వ కార్యాలయాలు ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



రాజంపేట : పొర్లు దండాలు పెడుతూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు



సుండుపల్లె : ఎస్ఐకి వినతిపత్రం ఇస్తున్న అంగన్వాడీలు

విద్యుత్ మీటర్లు రద్దు చేయాలి

- ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి



విద్యుత్ మీటర్‌ను పరిశీలిస్తున్న ప్రభాకర్‌రెడ్డి, నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ పంపు సెట్లకు విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేయడం విరమించుకోవాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక జిల్లా కార్యాలయంలో రైతు సంఘం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం కొండవాండ్ల పల్లిలో విద్యుత్ స్తంభాలకు బిగించిన మీటర్లను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ శ్రీ షిర్డి సాయికి చెందిన విద్యుత్ మీటర్లు స్థానిక విద్యుత్ స్తంభాలకు ఎలాంటి అనుమతులు లేకపోయినా ఏర్పాటు చేయడం విడ్డూరమని చెప్పారు. రైతు భరోసా కేంద్రాలు నిర్మించిన వారికి పెండింగ్ బిల్లులు ఇవ్వాలని కోరారు. ఇప్పటికే పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక చేసిన అప్పులు తీరక రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇప్పుడు మళ్ళీ మీటర్లు బిగించడం. దారుణమన్నారు. కరెంట్ ఛార్జీలు రైతుల ఖాతాలో వేస్తామని చెప్పి గ్యాస్ సబ్సిడీ మాదిరగా ఎగ్గొట్టేస్తారని చెప్పారు. వాడిన కరెంట్‌కు ఏ సంవత్సరంలో నైనా సార్ ఛార్జీలు వసూలు చేస్తారని, రైతుకు నష్టం చేసే స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్.రామచంద్ర, నాగబసిరెడ్డి, రైతులు సహదేవ్ రెడ్డి, కొండయ్య పాల్గొన్నారు.

రెగ్యులర్ చేసే వరకూ సమ్మె కొనసాగిస్తాం

- చెవిలో పువ్వులు పెట్టుకుని వినూత్న నిరసన
- 7వ రోజూ కొనసాగిన సమ్మె



రాయచోటి : నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలని యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.చెన్నయ్య సి.రాంబాబు డిమాండ్ రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా సోమవారం 7వ రోజు మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడచిన నాలుగున్నరేళ్లగా మున్సిపల్ ఉద్యోగ, కార్మికులు తమ సమస్యల పరిష్కారం చేయాలని ప్రభుత్వ పెద్దలకు అభ్యర్థించి, వినతులు సమర్పించినా పట్టించుకోలేదని విసిగి వేసారి పోయిన కార్మికులు ఈ సమ్మెబాట పట్టవలసి వచ్చిందని చెప్పారు. ముఖ్య మంత్రి ప్రతిపక్ష నేతగా పాదయాత్ర సందర్భంగా ఒక సంవత్సరం ఓపిక పట్టండి మన ప్రభుత్వం వచ్చిన 6 నెలల లోపే కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ కార్మికులందరిని రెగ్యులర్ చేస్తామని, పనికి వేతనం చెల్లిస్తామని చెప్పిన మాటను గాలికి వదిలేశారని వాపోయారు. కార్మిక శాఖ ప్రతిపాదనల మేరకు జిఒ 30 ప్రకారం పంపు ఆపరేటర్లు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వర్కర్స్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు కంప్యూటర్ ఆపరేటర్లు, బిల్ కలెక్టర్లు, స్ట్రీట్ లైటింగ్, టౌన్ ప్లానింగ్, ఆఫీసు నిర్వహణ కార్మికులకు వేతనాలు పెంచుతామని మూడేళ్లుగా హామీలతోనే సరిపెడుతున్నారని విమర్శించారు. మున్సిపల్ కార్మికులు 10-15 ఏళ్లుగా నైపుణ్యంతో కూడిన పనులు నిర్వహిస్తున్న ఇంజినీరింగ్ కార్మికులకు టెక్నికల్ వేతనాలు చెల్లించకుండా ప్రభుత్వం దాగా చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్మికులకు ఆదాయ పరిమితితో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ పట్టించుకోకపోవడం ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణాల విస్తీర్ణం, జనాభా పెరుగుదల దృష్ట్యా కార్మికులను పెంచడం లేదన్నారు. సమ్మెతోనైనా ప్రభుత్వానికి కనువిప్పు కలిగి సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సిద్దయ్య, అగ్గిరామయ్య, శిద్దముల్లు, అశోక్, రవికుమార్, వై. వెంకటరమణ, మంగమ్మ, రమణమ్మ పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** మున్సిపల్ కార్మికులు ఏడవ రోజు సమ్మెలో పురపాలక కార్యాలయం ఎదుట చెవిలో పూలు పెట్టుకొని నిరసన తెలిపారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో మున్సిపల్ కార్మికులకు లేనిపోని హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చాక అందరి చెవుల్లో పూలు పెట్టి వంచన చేశారని ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు లక్ష్మీదేవి, కార్మికులు ప్రసాద్, పెంచలయ్య, మధు, జి.పెంచలయ్య, గంగయ్య లక్ష్మీదేవి, రమణ, సురేష్ పాల్గొన్నారు.



రాజంపేట : చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలుపుతున్న కార్మికులు



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ యూవరాజ్

'మిట్స్'లో అత్యాధునిక ల్యాబ్ ప్రారంభం

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లె సమీపంలోని మిట్ ఇంజినీరింగ్ కళాశాలలో అత్యాధునిక టెక్నాలజీతో కూడిన కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, వైస్ ప్రిన్సిపల్ పి.రామనాథన్, కళాశాల డీన్ గౌతం చక్రబర్తి ప్రారంభిచారన్నారు. అత్యాధునిక టెక్నాలజీ ఇంటెల్ ఐ 7 ప్రాసెసర్, 13 జనరేషన్, 32 జి.బి రామ్, 18 జి.బి గ్రాఫిక్స్ కార్డు, 1 టిబి హార్డ్ డిస్క్‌తో కూడిన 150 కంప్యూటర్ సిస్టంతో ల్యాబ్‌ను ప్రారంభించినట్లు వారు తెలిపారు. ప్రస్తుతం కంప్యూటర్ సైన్స్ రంగంలో రోజురోజుకు ఎన్నో నూతన సాఫ్ట్వేర్‌లు ఉద్భవిస్తున్నాయని చెప్పారు. అవి వేగంగా కంప్యూటర్‌లో రన్ అవడానికి మామూలు కంప్యూటర్లు పనికిరావని పేర్కొన్నారు. ఈ నూతన టెక్నాలజీతో కూడిన కంప్యూటర్లు అవసరమన్నారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ కుసుమ, విభాగాధిపతులు పాల్గొన్నారు.

రేపు యుటిఎఫ్ 12 గంటల నిరసన దీక్ష

ప్రజాశక్తి-మదనపల్లి : ఈ నెల 3వ తేదీన 12 గంటల నిరసన దీక్షను విజయవంతం చేయాలని యుటిఎఫ్ నాయకులు పిలుపు నిచ్చారు. ఉపాధ్యాయులు, కార్మికులకు రావాల్సిన దీర్ఘకాలిక బకాయిలను ప్రభుత్వం తక్షణం విడుదల విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట జరుగు నిరసన దీక్షను విజయవంతం చేయాలని యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు సుధాకర్ నాయుడు, జిల్లా కార్యదర్శులు పురం వెంకటరమణ, ఆదినారాయణ పిలుపునిచ్చారు. ఉద్యోగులు తమ పిల్లల వివాహాలు చదువుల నిమిత్తం పొదుపు చేసుకున్న పిఎఫ్, ఎపిజిఎల్ఐ, పిఆర్‌సి, డిఎ బకాయిలు దాదాపు రూ.18 వేల కోట్లు ప్రభుత్వం ఉద్యోగులకు విడుదల చేయకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత వారంలో డివిజన్ స్థాయిలో నిరసన దీక్షలు చేపట్టామన్నారు. జిల్లా స్థాయిలోనూ, ఆరో తేదీన రాష్ట్ర స్థాయిలో దీక్షలకు పిలుపునిచ్చామన్నారు. తక్షణం ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివిజన్ కన్వీనర్ సుధాకర్, పట్టణ అధ్యక్షులు భానుమూర్తి, ప్రధాన కార్యదర్శి హరికృష్ణ, బెల్లం సీనప్ప, బెల్లం సుధాకర, హసన్‌బాషా, రామ్మోహన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు



ఇఒకు ఆటోల తాళాలు అందజేస్తున్న కొరముట్ల శ్రీనివాసులు

చెత్త సేకరణకు ఆటోలు వితరణ హర్షణీయం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రైల్వేకోడూరు గ్రామ పంచాయతీలో చెత్త సేకరణ కొరకు రెండు ఆటోలను ఉప సర్పంచ్ తోట శివ సాయి బ్రదర్స్ వితరణ చేయడం హర్షణీయమని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. వైసిపి కార్యాలయంలో కోడూరు పట్టణంలో చెత్త సేకరించుటకై ఉప సర్పంచ్ శివ సాయి, తోట సుబ్రహ్మణ్యం సాయి తండ్రి తోట శ్రీనివాసులు జ్ఞాపకార్థంగా తోట బ్రదర్స్ వారి సొంత నిధులు రూ.తొమ్మిది లక్షల వ్యయంతో రెండు ఆటోలను వితరణ చేయగా ఎమ్మెల్యే చేతుల మీదుగా వాటి తాళాలను ఇఒ ప్రసాద్ రావు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండల చైర్మన్ సుకుమార్ రెడ్డి, వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ హేమన వర్మ, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్ రాజు, జిల్లా కో-ఆప్షన్ సభ్యులు అన్వర్‌బాష, జడ్‌పిటిసి రత్నమ్మ, సర్పంచ్ శివయ్య, ఉప సర్పంచ్ శివ సాయి, సిద్దయ్య, పట్టణ అధ్యక్షుడు సిహెచ్ రమేష్, అంబటి మురళి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న ఎస్ఎస్ఎ ఉద్యోగులు

ఎస్ఎస్ఎ ఉద్యోగుల పోస్టు కార్డుల ఉద్యమం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటాలు చేస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు, కెజిబివి ఉపాధ్యాయులు సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద పోస్ట్ కార్డులు చేత పట్టి నిరవధిక సమ్మె చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హక్కులు, న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి పోరాటం చేస్తుంటే షోకాజ్ నోటీసులు ఇస్తామని, చెప్పిన మాట వినకపోతే సస్పెండ్ చేస్తామని, అంతకు కాదంటే డిస్మిస్ చేస్తామని ప్రభుత్వం బెదిరించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ సంకేతాలు జగన్ నియతృత్వ పాలనకు నిదర్శనమని అన్నారు. పాదయాత్ర సమయంలో అధికారం కోసం ఇష్టం వచ్చినట్లు హామీలు ఇచ్చి అవి అమలు చేయలేక చేతులెత్తేసిన జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్క ఉద్యోగి ఓటుతో బుద్ధి చెప్పాలని అన్నారు. ముఖ్యమంత్రి జగన్ ఇప్పటి కైనా స్పందించి సమగ్ర శిక్షా ఉద్యోగులు చేస్తున్న ఆందోళనను గుర్తించి వారి డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. పోస్ట్ కార్డుల ద్వారాతమ నీరసనను తెలిపారు. సమస్య పరిష్కరించక పోతే సమ్మె మరింత ఉధృతం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

బాలుడికి కలెక్టర్ చేయూత

- రోబోటిక్ కృత్రిమ చేతులు అందజేత

ప్రజాశక్తి - రాయచోటి : విభిన్న ప్రతిభా వంతుడైన బాలుడికి కలెక్టర్ గిరీషా చేయూ తనందించారు. వివరాలు. జిల్లాలోని టి.సుండుపల్లి మండలం జికె రాజు పల్లెకు చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న సులేమాన్ అనే విద్యార్థికి 2022 మేలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయి రెండు చేతులు కోల్పోయాడు. ఈ సంఘటనతో అతని తల్లిదండ్రులు పూర్తిగా కుంగిపోయి భవిష్యత్తు అంధకారం అవుతుందని దిగులు పడ్డారు. ఈ క్రమంలో గత ఏడాది ఆగస్టులో స్పందన కార్యక్ర మంలో సులేమాన్ పరిస్థితిని వివరించారు. విద్యార్థి సులేమాన్ పరిస్థితి చూసి చలించి పోయిన కలెక్టర్ ప్రభుత్వం ద్వారా అతని ఆదుకొనడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖను ఆదేశించారు. కలెక్టర్ స్వయంగా సదరు అర్జీని పర్యవేక్షించి 2023 సెప్టెంబర్ 11న రూ. 65 వేలు విలువచేసే ఆర్టిఫిషియల్ ఇంటె లిజెన్స్ (ఎఐ)తో పనిచేసే స్మార్ట్ ఫోన్ బాలుడికి అందజేశారు. తరువాత ఆధునిక బయోనిక్ ఆర్మ్ (కృత్రిమచేతులు)ను ఇవ్వాలని జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడిని ఆదేశిస్తూ అందుకు అవసరమైన రూ.2.50 లక్షల నిధులను మంజూరు చేయించారు. ఆయన ఆదేశాల మేరకు కుడి, ఎడమ చేతులకు జర్మనీ నుంచి రోబోటిక్ ఆర్మ్ తెప్పించారు. వీటిని సోమ వారం కలెక్టరేట్‌లోని కలెక్టరేట్లోని తన చాంబర్లో నూతన సంవత్సరం సందర్భంగా కలెక్టరే స్వయంగా విద్యార్థి సులేమాన్‌కు కృత్రిమ చేతులను అమర్చారు. ఈ సందర్భంగా నోట్ బుక్‌లో "హ్యాపీ న్యూ ఇయర్ 2024 - థాంక్యూ సార్" అని విద్యార్థి సులేమాన్ రాసి కలెక్టర్‌కు తన కృతజ్ఞతలు తెలియపరిచారు. కృత్రిమ చేతులతో బాగా రాయడం అలవాటు చేసు కోవాలని, బాగా చదువుకొని జీవితంలో అభివృద్ధిలోకి రావాలని కలెక్టర్, జెసి విద్యార్థి సులేమాన్‌ను భుజం తట్టి ప్రోత్సహించారు. కార్యక్రమంలో జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ఆర్.వి.కృష్ణ కిషోర్, రీహబిలిటేషన్ అధికారి శ్రీకాంత్, విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థికి కృత్రిమ చేతిని అమర్చడాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ గిరీష



అన్న క్యాంటీన్ ప్రారంభిస్తున్న గంటా నరహరి

రాజంపేటలో టిడిపి జెండా ఎగురవేద్దాం : 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ జెండాను ఎగురవేద్దామని టిడిపి రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. టిడిపి నేత గంటా నరహరి సహకారంతో ఆర్ఎస్ రోడ్డులో సోమవారం ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో ప్రజలు అన్ని విధాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో సైకో ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్తారన్నారు. జగన్‌ను గద్దె దించే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. నేను విన్నాను-నేను ఉన్నాను అని మాయమాటలు చెప్పి, ముఖ్యమంత్రైన జగన్ ప్రజా సమస్యలు గాలికి వదిలేసి కక్షపూరితంగా వ్యవహరిస్తూ సైకో ఆనందాన్ని పొందుతున్నారని విమర్శించారు. తెలుగుదేశం ప్రభుత్వ హయంలో అన్న క్యాంటీన్ ఎంతోమంది కూలి పనులు చేసుకునే నిరుపేదలకు ఆసరాగా నిలిచిందన్నారు. అటువంటి అన్న క్యాంటీన్లను నిర్వీర్యం చేసి పేదవాని కడుపు కొడుతూ రాక్షస ఆనందం పొందుతున్నారన్నారు. రానున్న ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ అధికారం చేపడుతుందని, అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. తెలుగుదేశం పార్టీ సమిష్టి కృషితో రాజంపేటలో పార్టీ జెండా ఎగరవేస్తామని పేర్కొన్నారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షులుగా 'తుమ్మల'

ప్రజాశక్తి -లక్కిరెడ్డిపల్లి : పిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులుగా తుమ్మల వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. సోమవారం డిసిసి అధ్యక్షులు షేక్ అల్లాబకష్ చేతుల మీదుగా లగ్గిరెడ్డిపల్లి మండల అధ్యక్షునిగా వెంకటేశ్వర్లు నియామక పత్రాన్ని అందుకున్నారు, ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తన నియామకానికి కృషిచేసిన రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్, డిసిసి అధ్యక్షుడు అల్లబకాష్ కు కృతజ్ఞతలు తెలిపారు, రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని, రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతారని, నూతన సంవత్సరంలో నిర్వహించబోయే కురుక్షేత్ర యుద్ధంలో కాంగ్రెస్ పార్టీ తప్పక విజయం సాధిస్తుందని చెప్పారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని ఆయన జోష్యం చెప్పారు. శక్తివంచన లేకుండా పార్టీ బలోపేతానికి, అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆయన అన్నారు కార్యక్రమంలో పార్టీ నాయకులు రఫిక్, అమీర్ బాష, చెన్న కృష్ణ, ఖాదర్ ఖాన్, నరేష్, బషీర్ , వెంకటసుబ్బయ్య, సుభాష్ పాల్గొన్నారు.

జెసిబి ఢీకొని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-గాలివీడు : నిలుచున్న జెసిబిని ఢీకొని ఓ వ్యక్తి గాయపడ్డారు. వివరాలు.. తమిళనాడుకు చెందిన శరణ్ అనే వ్యక్త గేటు వద్ద తాపీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం అతను ద్విచక్రవాహనం పై వస్తూ నిలబడి ఉన్న జెసిబిని బలంగా ఢీకొన్నాడు. ప్రమాదంలో అతని తలకు బలమైన గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ శివకుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా రాయచోటి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి : 'చింతల'


రాజంపేట : చమర్తిని సన్మానిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ప్రజలంతా నూతన సంవత్సరంలో సుఖసంతోషాలతో ఉండాలని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం వాల్మీకిపురంలోని వైసిపి కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు, అధికారులు, ప్రజల సమక్షంలో నూతన సంవత్సర కేక్‌ను కట్ చేసి అందరికీ పంచి పెట్టి నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని నలుమూలల నుంచి వచ్చిన ఆయన అభిమానులు, కార్యకర్తలు, వివిధశాఖల అధికారులు, ప్రజలు ఎమ్మెల్యే చింతలను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ వర్షాలు బాగా కురిసి రైతులు పండించే పంటలు సమృద్ధిగా పండి రైతులకు మేలు చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధశాఖల అధికారులు, పాల్గొన్నారు. మండలంలోని దేశాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. రెండు రోజుల నుంచి భక్తుల కోసం ప్రత్యేక సదుపాయాలు ఏర్పాటు చేశారు. స్థానిక సిఎస్ఐ చర్చిలో నూతన సంవత్సర వేడుకలను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. పాస్టర్ మేరి మాట్లాడుతూ ఏసు క్రీస్తు ఆశీస్సులే సమాజాభివృద్ధికి నాంది అని అన్నారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. **రాజంపేట అర్బన్ :** దౌర్జన్య, దుర్మార్గ పాలన నుంచి ఈ నూతన సంవత్సరంలో ప్రజలకు విముక్తి లభించాలని, ఈ నూతన సంవత్సరం మార్పుకు నాంది కావాలని జనసేన నాయకులు పేర్కొన్నారు. జనసేన కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేకు కోసి అట్టహాసంగా సంబరాలు జరుపుకున్నారు. కార్యక్ర మంలో జనసేన పార్టీ రాష్ట్ర చేనేత వికాస కార్యదర్శి రాటాల రామయ్య, లీగల్ సెల్ అధ్యక్షులు సుబ్బా రాయుడు, నాయకులు భాస్కర్ పంతులు, పోలిశెట్టి శ్రీను, రజిత, కార్యకర్తలు, వీరమహిళలు పాల్గొన్నారు. **'చమర్తి' ఆధ్వర్యంలో...** నూతన సంవత్సరం సందర్భంగా పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్‌రాజు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. నియోజకవర్గంలోని 6 మండలాల నుంచి పెద్ద ఎత్తున టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి పూల బొకేలు, శాలవాలు, గజమాలతో ఆయనను సన్మానించారు. **కలికిరి:** టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి ఇంట నూతన సంవత్సర వేడుకలు నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. నూతన సంవత్సరం సందర్భంగా 100 కిలోల భారీ కేకును నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి, ఆయన కుమారుడు యువ నాయకుడు నల్లారి అమర్నాథ్ రెడ్డి కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు నిజాముద్దీన్, సర్పంచ్ రెడ్డివారి ప్రతాప్ రెడ్డి, కెవిపల్లి నాయకులు రెడ్డి శేఖర, గీతమ్మ, మాజీ ఎంపీటీసీ జనార్దన్ గౌడ్, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు అగస్తీశ్వర్, శ్రీనివాస్ వర్మ పాల్గొన్నారు. జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి విహారి ఆధ్వర్యంలో నాలుగు రోడ్ల కూడలిలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఎపిఎండిఎంసి హరీష్‌రెడ్డిని దుశ్శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కాలనీ మూర్తి, చీకటి పల్లి మదన్మోహన్ రెడ్డి, సహదేవ, శ్యామ్ సురేష్ పాల్గొన్నారు. అనంతరం మైనార్టీ యువ నాయకులు వేంపల్లి ఖాదర్బాషా వార్డు మెంబర్, వెలుగు సిసి శంకర, షామీర్‌బాష, సోషల్ మీడియా కలికిరి భాను ప్రకాష్ ఎమ్మెలకు శుభాకాంక్షలు తెలియజేశారు. **పుల్లంపేట :** నూతన సంవత్సరం పురస్కరించుకొని రైల్వే కోడూరు తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి కస్తూరి విశ్వనాథ నాయుడుని పుల్లంపేట మండల ఉపాధ్యక్షులు కాపిర్ల చంద్రశేఖర్ నాయుడు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్ర మంలో టిడిపి మండల అధ్యక్షులు సుధాకర్ నాయుడు, నాయకులు సుబ్బరాయుడు, పోలూరు కృష్ణమ నాయుడు, జనరల్ సెక్రటరీ గడికోట రామకృష్ణ, యూనిట్ ఇన్‌ఛార్జి చుండు ఈశ్వర్ నాయుడు, నాగినేని వెంకటసుబ్బయ్య నాయుడు, జనసేన నాయకులు రామ్మూర్తి, బోధనపు మస్తాన్ పాల్గొన్నారు. **కలకడ:** తెలుగు తమ్ముళ్లు పీలేరు నియోజకవర్గ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి, ఆయన తనయుడు అమర్నాథ్‌రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మండలంలోని తెలుగు తమ్ముళ్లు కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కలకడ మండల టౌన్ ఇన్‌ఛార్జి వై.జిలానిబాష, కరిముల్లా బాష, ఇర్ఫాన్ మహమ్మద్, ముబారక్ అలీ, నౌషద్, ఖాజా హుస్సేన్ పాల్గొన్నారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్రైస్తవ సోదరులు చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు. **ఎంపిపి శ్రీదేవి ఆధ్వర్యంలో..** రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డిని కలకడ ఎంపిపి శ్రీదేవి రవికుమార్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి శాలువా బొకేలతో సత్కరించారు. హరీష్ రెడ్డి, ఇక్బాల్ అహ్మద్ ఖాన్‌కు శుభాకాంక్షలు చెప్పారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు రవికుమార్ పాల్గొన్నారు. **పీలేరు:** నూతన సంవత్సరం సందర్భంగా ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. కొత్త సంవత్సరంలో ప్రజాప్రతినిధులు, నాయకులను ఆయా రాజకీయ పార్టీల శ్రేణులు కలిసి సత్కరించారు. **పెద్దమండ్యం :** మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్‌ను కలిసి టిడిపి నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆరు మండలాల కన్వీనర్లు, క్లస్టర్, యూనిట్, బూత్ నాయకులు, మాజీ ప్రజాప్ర తినిధులు, గ్రామ కమిటీ నాయకులు పాల్గొన్నారు. **పీలేరు:** ఆర్టీసీ డిపో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు సభ్యులు తమ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు జివి శ్రీనాథ రెడ్డి, ఎస్‌టిఒలను కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీనాథ్ రెడ్డిని, ఎస్‌టిఒలను కలిసి తమ అభిమానాన్ని చాటు కున్నారు. డిపోలో ఉద్యోగస్తులుకు కూడా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెల్పి బహుమతులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా కార్యదర్శి పిఎస్ఎమ్ రాజు, జిల్లా కమిటీ నాయకులు ఎమ్వేచ్ నాయు డు, కెఎస్ మణ్యం, డిపో అధ్యక్షులు జిఎస్ రామయ్య, బిఆర్ బి నాయక్, విపి నాయుడు, కె.నాగరాజ, జె.శేఖర్ పాల్గొన్నారు.


రాజంపేట : కేక్‌కట్ చేస్తున్న జనసేన నాయకులు


కలికిరి : కేక్ కట్ చేస్తున్న టిడిపి నేత కిషోర్‌కుమార్‌రెడ్డి


కలకడ : ఎంపీ, ఎమ్మెల్యే చింతలను సన్మానిస్తున్న ఎంపిపి శ్రీదేవి


పీలేరు : మాజీ ఎమ్మెల్యేని సన్మానిస్తున్నఆర్‌టిసి ఉద్యోగులు


ధ్రువీకరణ పత్రాన్ని అందుకుంటున్న వెంకటరమణారెడ్డి

మత్స్య సహకార సంఘం అధ్యక్షులుగా సివిఆర్

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

బహుదా మత్స్య సహకార సంఘం అధ్యక్షునిగా సి.వెంకట రమణారెడ్డి (సి.వి.ఆర్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం మండలంలోని బహుదా ప్రాజెక్టు వద్ద మత్స్యశాఖ అభివృద్ధి అధికారి కార్యా లయంలో సంఘం ఎన్నికలు మత్స్య శాఖాధికారి సుబ్బనరసయ్య ఆధ్వర్యంలో, స్థానిక సర్పంచు చంద్రాయుడు, సింగిల్ విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి సమక్షంలో నిర్వహించారు. పీలేరు మత్స్యశాఖ అధికారి మోహనకృష్ణ ఎన్నికల అధికారిగా వ్యవహరించగా బహుదా మత్స్య సహకార సంఘంలోని 24 మంది సభ్యులు గాను 21 మంది సభ్యులు ఎన్నికకు హాజరయ్యారు. ఈ ఎన్నికల్లో వలస పల్లెకు చెందిన మత్స్య సహకార సంఘం సభ్యులు, సి.వెంకటరమణారెడ్డి అధ్యక్షులుగా, ఎర్రప్పగారి పల్లెకు చెందిన పి.రమణప్ప ఉపాధ్యక్షులుగా, జి.కొండయ్య, కె.వెంకటరమణ, ఎం.చెన్నప్ప, ఎం.శ్రీరాములు, కె.కృష్ణప్ప, బీరాం సాహెబ్, వెంకటరమణారెడ్డి డైరెక్టర్లుగా ఎన్నికయ్యారు. ఎన్నిక కమిటీకి సభ్యులందరూ చేతులెత్తి ఏకగ్రీవంగా తమ మద్దతు తెలిపారు. ఎన్నిక ప్రక్రియ అనంతరం బహుదా మత్స్య సహకార సంఘ నూతన ఎన్నిక కమిటీ వివరాలతో కూడిన ధ్రువపత్రాన్ని ఎన్నికల అధికారి మోహనకృష్ణ వెంకటరమణారెడ్డికి అందజేశారు. ఎన్నికైన కమిటీకి ఐదు సంవత్సరాల కాల పరిమితి ఉంటుందని మత్స్య శాఖాధికారి (ఎఫ్‌డిఒ) సుబ్బ నరసయ్య తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ బహుదా మత్స్య సహకార సంఘం పరిధిలోని బహుదా ప్రాజెక్టు, ఇతర చెరువులలో చేపలను పెంచి, విక్రయించి మత్స్యకారులు అభివృద్ధి చెందేలా చర్యలు చేపడతామన్నారు. ప్రభుత్వం మత్స్య శాఖ ద్వారా అందించే రాయితీలను సద్వినియం చేసుకొని సంఘ సభ్యులు ఆర్థిక అభివృద్ధి సాధించేలా కృషి చేస్తానన్నారు.

రేపు నేలమల్లేశ్వర ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండలంలోని శ్రీ నేలమల్లేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణ భూమిపూజ కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు తరలి రావాలని ఆలయ కార్య నిర్వహణాధికారి మంజుల తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ తవళం గ్రామం అటవీ ప్రాంతంలో వెలసిన శ్రీ యోగ నేలమల్లేశ్వర స్వామి ఆలయం ప్రస్తుతం శిథిలావస్థ దశకు చేరుకొని కొద్దిపాటి వర్షానికి కూడా వరుస్తూ ఉండడం జరుగుతున్నాదన్నారు. ఆలయ అభివృద్ధిని ఆకాంక్షిస్తూ ఆలయాన్ని పునర్నిర్మాణం చేపట్టడానికి ఇదివరకే దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వానికి నివేదికలు అందించి చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. జనవరి 3వ తేదీన ఆలయ పునర్నిర్మాణం సందర్భంగా బుధవారం ఉదయం 8.30 నుంచి 9.30 గంటల మధ్య భూమిపూజ శంకుస్థాపన కార్యక్రమం వైభవంగా జరుగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అటవీ, విద్యుత్, పర్యావరణ, శాస్త్ర, సాంకేతిక మరియు భూగర్భగనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మదనపల్లి శాసనసభ్యులు ఎం.నవాజ్‌బాషా, తంబళ్లపల్లి ఎమ్మెల్యే పి.ద్వారకనాథరెడ్డి పాల్గొంటారన్నారు.

వేడుకగా కెకె.రెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఎన్ఆర్ఐ మన్నూరు కృష్ణ కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం మండలలోని పెద్ద కారంపల్లి పంచాయతీతో పాటు రాజంపేటలో కూడా అట్టహాసంగా ఆయన అభిమానులు, కుటుంబ సభ్యులు నిర్వహించారు. ముందుగా కుటుంబ సభ్యులు పెద్ద కారంపల్లిలో కెకె.రెడ్డి నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ పెద్ద కారంపల్లి పంచాయతీ అభివృద్ధికి, నిరుపేదలకు సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు శ్రీ మన్నూరు రామలక్ష్మమ్మ, శ్రీ నారాయణరెడ్డి ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో నిర్వహించాలని, ఇటువంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు మున్నూరు వెంకటసుబ్బారెడ్డి, మన్నూరు నారాయణరెడ్డి, మన్నూరు శోభారాణి, అశోక్ రెడ్డి, భార్గవ్ రెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


కెకె.రెడ్డి జన్మదిన వేడుకలలో పెద్దకారంపల్లె ప్రజలు


సమావేశంలో మాట్లాడుతున్న పులి శ్రీనివాసులు

ఎయిర్‌పోర్టుకు వాల్మీకి పేరు పెట్టడంపై హర్షం

ప్రజాశక్తి-మదనపల్లి

అయోధ్య ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు వాల్మీకి మహర్షి నామకరణం చేయడంపై వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీనివాసులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక వాల్మీకి సంఘం కార్యాలయంలో మదనపల్లి టౌన్ అధ్యక్షుడు వలసల మంజునాథ్ అధ్యక్షతన సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. వాల్మీకి మహర్షి-శ్రీరాముని మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని ధర్మబద్ధంగా నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యక్షులు పులి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు సద్దల జయసింహ, టౌన్ అధ్యక్షుడు వలసల మంజునాథ్, ఒకటో వార్డు అధ్యక్షుడు తలారి గంగాధర, 35వ వార్డు అధ్యక్షులు వలసల శ్రీనివాసులు, రెండవ వార్డ్ మహిళా అధ్యక్షురాలు నిర్మలమ్మ, నవోదయ కాలనీ మహిళా అధ్యక్షులు జోల పాలెం గీత, శ్రీనివాసులు, ఆటో యూనియన్ అధ్యక్షులు నరసింహులు పాల్గొన్నారు.

నేడు గట్టులో ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి - బి.కొత్తకోట

మండలంలోని గట్టు పంచాయతీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ శంకరయ్య పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి హాజరవుతారన్నారు. గట్టు పంచాయతీ దిన్నిమీదపల్లె, సీతివారిపల్లె, గుండ్లపల్లె, నల్లగుట్టపల్లె, తరికొట, తోటివారిపల్లె, కొత్తపల్లి, గట్టు, పత్రవారిపల్లె, గుట్టపాలెం, నాయనబావి, కంబాలపల్లె, కాయలవారిపల్లె, ఆకులవారిపల్లె, యార్రంగారిపల్లె, రెడ్డివారిపల్లె, దేవరాసిపల్లెలో ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు గృహసారథులు పాల్గొంటారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న మానవత సభ్యులు

మానవత సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-గాలివీడు

మానవత సేవలు అభినందనీయమని సంస్థ రాయచోటి కన్వీనర్ బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. సోమవారం బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే మండలంలో బాడీ ఫ్రీజర్, శాంతి వాహనం ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. రాబోయే రోజుల్లో రక్తనిధి కేంద్రాలను కేడా ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. అనంతరం ఫిజికల్ డైరెక్టర్ మనోహర్ మానవత సంస్థలకు రూ.10 వేల నగదును విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో మానవత సంస్థ మండల డైరెక్టర్ సుబ్బారెడ్డి, అధ్యక్షులు రామ్మోహన్ నాయుడు, కన్వీనర్లు కానాల శివారెడ్డి, రామకృష్ణారెడ్డి, ట్రెజరర్ చెంగల్‌రాజు, వైస్ ఎంపిపి గాలి శ్రీనివాసులు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

వెలిగల్లులో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి-గాలివీడు

నూతన సంవత్సర సందర్భంగా సోమవారం వెలిగల్లు పార్కు, రిజర్వాయర్ పర్యాటకులతో కిటకిటలాడింది. జిల్లా నుంచేగాక వైఎస్ఆర్ జిల్లాలోని వేంపల్లె, సత్యసాయి జిల్లాలోని కదిరి, వాల్మీకిపురం, గుర్రంకొండ, మదనపల్లె ప్రాంతాల నుంచి విద్యార్థులు వారి తల్లిదండ్రులు ప్రాజెక్టును సందర్శించారు. పార్కుల్ కేరింతలు కొడుతూ తమ ఆనందాన్ని వ్యక్తపరిచారు. రిజర్వాయర్‌లో బోట్ షికారు చేశారు.


వెలిగల్లు రిజర్వాయర్ వద్ద పర్యాటకులు

రోడ్డును కప్పేసిన కంపచెట్లు - పట్టని అధికారులు

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలోని సుండుపల్లె పంచాయతీలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఎగువమాలపల్లి వరకు వెళ్లే మెటల్ రోడ్డును కంపచెట్లు కప్పేశాయి. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం ఎగువమాలపల్లి రామయ్య, చిన్నప్ప, వెంకటేశు మాట్లాడుతూ గ్రామస్తులు నిత్యం మండల కేంద్రానికి ఈ మార్గం గుండా రాకపోకలు సాగిస్తుంటారని చెప్పారు. రాత్రి వేళల్లో కొత్త వ్యక్తులు ఈమార్గాన వస్తూ కంపచెట్ల వల్ల ప్రమాదాలకు గురవుతున్నారని చెప్పారు. గతంలో రూ. 60 లక్షలతో ప్రభుత్వం తారు రోడ్డు మంజూరు చేసింది. కొంతమంది స్వార్థ రాజకీయ నాయకుల వల్ల పనులు మధ్యలోనే ఆపేశారని వాపోయారు. రోడ్డు దుస్థితిపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధితాధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లును తొలగించి ప్రమాదాలను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.


రోడ్డుకు అడ్డంగా ఉన్న కంపచెట్లు

కార్మికుల రుణం తీర్చుకోలేనిది

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు : ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు.. ఇంతటి మహాభాగ్యాన్ని మనకు అందించేందుకు మన ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచే కార్మికుల రుణం తీర్చుకోలేనిదని 33వ వార్డు కౌన్సిలర్ శివజ్యోతి అన్నారు. నూతన సంవత్సర శుభాకాంక్షలతో 33వ వార్డు పారిశుధ్య కార్మికులకు ప్రతి సంవత్సరరంలాగే ఈ ఏడాది కూడా సోమవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కేక్ కట్ చేసి సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల ఉద్యోగం చిన్నదైనా పెద్దమనసుతో చేసే ఈ ఉద్యోగం ఎంతో గొప్పదని కొనియాడారు. మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. వార్డు పెద్దలు కోనేటి ప్రసాదరెడ్డి, అచ్చు కట్ల హుశేన్ సాహెబ్, మైనారిటీ నాయకులు పాలగిరి బాబ, అబ్దుల్‌కలాం, షఫీ, అన్వర్ బాషా, ఖాదర్‌వలి, లడ్డు మస్తాన్, జహీరుద్దీన్, రెహెమాన్ పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్ : పట్టణంలోని శిల్పారామంలో మహేష్ ఎస్‌కే డ్యాన్స్ ఫిల్మ్ స్టుడియో మాస్టర్ శర్వన్, మనూస్ డ్యాన్స్ అకాడమీ, కదిరి మాష్టర్ మనోహర్ వారి చిన్నారులచే జానపద, సినీ పాటలకు ప్రదర్శించిన నృ త్యాలు ప్రేక్షకులను అల రించాయి. నూతన సంవ త్సరం సందర్భంగా సోమవారం సాయంత్రం చిన్నారులు నృత్యాలు ప్రదర్శిం చారు. కార్యక్రమంలో శిల్పారామం పరిపాలన అధికారి సుధాకర్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ బుట్టలు పంపిణీ

ప్రజాశక్తి - ముద్దనూరు : నూతన సంవత్సరం సందర్భంగా మండల నాయకులు కటికరెడ్డి మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో ఆయన కుమారుడు యువనాయకులు కటికరెడ్డి గుణవంత్‌రెడ్డి కానుకగా ఆదివారం 600 కుటుం బాలకు ప్లాస్టిక్ బుట్టలు పంపిణీ చేశారు. స్థానిక ఎల్ఎమ్ కాంపౌండ్, ఎస్వీ గిరి కాలనీలోని ప్రజలకు మండల కేంద్రంలోని సిఎస్ఐ, సిఎస్ఐ (ఎస్పీజీ), ఆర్‌సిఎం, హెబ్రోను, మన్నా మొదలైన చర్చిలలో ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ ప్లాస్టిక్ బుట్టలు పంపిణీ చేశారు. మధుసూదనరెడ్డి, గుణవంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మండల ప్రజలకు గిఫ్ట పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. క్రిస్మస్, సంక్రాంతి, రంజాన్ పండుగలకు ప్రజలకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఎల్ఐసి ఏజెంట్లు అభినందనీయులు

ప్రజాశక్తి- కడప అర్బన్ : ఎల్ఐసి కడప బ్రాంచ్ పరిధిలో ఏడుగురు ఏజెంట్లు ఎండిఆర్‌టి (మిలియన్ డాలర్ రౌండ్ టేబుల్) స్థాయిలో బీమా వ్యాపారం చేయడం అభినందనీయమని బ్రాంచ్ మేనేజర్ వెంకటకృష్ణ అన్నారు. 2023, జనవరి 1 నుంచి డిసెంబర్ 31 లోగా రూ.35 లక్షల కంటే ఎక్కువగా ప్రీమియం సేకరించి ఎండిఆర్‌టి స్థాయికి చేరుకున్న బి.మునెయ్య, జిఎల్ నరసింహులు, యస్.ఇస్మాయిల్, జి.కృష్ణమూర్తి, ఎన్.ఏ.రవూఫ్, ఆర్.నిత్యానంద రెడ్డి, డి.కాశిం హుస్సేన్ కు స్థానిక బ్రాంచ్ కార్యాలయ సభాభవనంలో జరిగిన సన్మాన సభ నిర్వహించారు. విజేతలను సంస్థ తరపున ఘనంగా సన్మానించారు. వీరంతా అమెరికా లేదా కెనడా దేశాలలో జూన్‌లో నిర్వహించే అంతర్జాతీయ ఆర్థిక రంగ ప్రొఫెషనల్స్ సమావేశాల్లో పాల్గొంటారని అన్నారు.

డీన్‌గా ఆచార్య పి.రమాదేవి

ప్రజాశక్తి- కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం తెలుగుశాఖలో ఆచార్యులు పి.రమాదేవిని డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఎడ్యుకేషన్‌గా వైస్‌ఛాన్సలర్ ఆదేశాలమేరకు నియమించినట్లు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆచార్య పి.రమాదేవి తెలుగుశాఖ పాఠ్యప్రణాళికా సంఘం అధ్యక్షురాలుగా, తెలుగుశాఖాధ్యక్షులుగా, డిప్యూటీ వార్డెన్‌గా, ఉమెన్స్ సెల్ సమన్వయకర్తగా బాధ్యతలు నిర్వహించారని పేర్కొన్నారు. సుదీర్ఘ బోధనానుభవం కలిగిన రమాదేవి వివిధ విశ్వవిద్యాలయాల పాఠ్య ప్రణాళికా సంఘం సభ్యులుగా పనిచేశారని తెలిపారు. వివిధ అంతర్జాతీయ, జాతీయ సదస్సుల్లో పాల్గొని పరిశోధన పత్రాలు సమర్పించారని పేర్కొన్నారు. ఆమె నియామకం పట్ల విసి ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, విశ్వవిద్యాలయ బోధన, బోధనేతర సిబ్బందిఅభినందనలు తెలిపారు.

వారసత్వ రక్షణే ధ్యేయం

నంది అవార్డు గ్రహీతలకు సత్కారం


అవార్డు గ్రహీతలను సత్కరిస్తున్న సంస్థల ప్రతినిధులు

ప్రజాశక్తి - కడప అర్బన్

తమ సంస్థలు ఉమ్మడిగా సేవా సంస్కృతి వారసత్వ సంపదలను రక్షించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నాయని, అందులో భాగంగా జిల్లాకు నంది అవార్డులు సాధించి పెట్టిన కళాకారులను ప్రత్యేకంగా అభినందిస్తున్నామని పలువురు కళాభిమానులైన వక్తలు పేర్కొన్నారు. ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి నంది నాటక పోటీల్లో జిల్లాకు చెందిన వైవీయూ పాలక మండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, సీనియర్ నాటక దర్శకులు పల్లేటి లక్ష్మీకులశేఖర్‌ను సోమవారం ఘనంగా సత్కరించారు. ఇంటాక్, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు ఆధ్వర్యంలో ఉమ్మడిగా స్థానిక మానస ఇన్ సమావేశ మందిరంలో అవార్డు గ్రహీతలకు సత్కార కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఇంటాక్ జిల్లా కన్వీనర్ లయన్ మానస కె. చిన్నపరెడ్డి మాట్లాడుతూ పర్యాటకపరంగా గండికోటలో అంతర్జాతీయ ఒబెరాయ్ హోటల్ ఏర్పాటుకు రంగం సిద్ధం కావడం, ఇంటాక్ కార్యక్రమంలో భాగంగా పాతకలెక్టరేట్‌కు మరమ్మతులు, లయన్స్ క్లబ్ పరంగా వంద దాటిన సేవా కార్యక్రమాలు తమకు గర్వకారణంగా నిలుస్తున్నాయన్నారు. ఇటీవల వారసత్వ కళల రక్షణ కోసం సీనియర్ నాటక సంస్థ సవేరా నిర్వహణ బాధ్యతను కూడా తీసుకున్నామని, ప్రారంభ దశలోనే తమ సభ్యులకు రెండు నంది అవార్డులు రావడం జిల్లాకే గర్వకారణమన్నారు. జిల్లాతోపాటు తమ సంస్థలు నూతన సంవత్సరంలో అభివృద్ధి పథంలో నడుస్తాయని, మరింత పేరు తెచ్చుకునేందుకు కృషి చేస్తామన్నారు. అవార్డు గ్రహీతల్లో ఒకరైన మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ నంది అవార్డు కంటే వైఎస్సార్ పేరిట జిల్లా రచయిత సంఘాన్ని ఏర్పాటు చేసి మూడు నెలల్లోనే మహాసభలను విజయవంతంగా నిర్వహించడం మరువలేని జ్ఞాపకంగా నిలుస్తుందన్నారు. పల్లేటి లక్ష్మీకులశేఖర్ మాట్లాడుతూ నాటక రంగం తనకు తల్లిలాంటిదని, తన ఉన్నతికి కారణమైన సవేరా సంస్థను మరిచి పోలేమని, చిన్నపరెడ్డి పర్యవేక్షణలో వంద నందులు సాధించగలమన్న విశ్వాసం ఉందన్నారు. డాక్టర్ పుత్తా బాలిరెడ్డి మాట్లాడుతూ సవేరా లాంటి సంస్థ నిర్వహణ బాధ్యత తీసుకోవడం జిల్లా నాటక రంగానికి ఆయువు పోసినట్లైందన్నారు. మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి, ఇంటాక్ పూర్వ కన్వీనర్ ఎలియాస్‌రెడ్డి, డాక్టర్ తవ్వా వెంకటయ్య, రెడ్డిశేఖర్‌రెడ్డి, కొండూరు జనార్దన రాజు కార్యదర్శి నివేదికను సమర్పించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలతోపాటు రెడ్డి శేఖర్‌రెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో బాలగొండ గంగాధర్, గునిశెట్టి శ్రీని వాసులు, రమణారెడ్డి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కారు, బైక్ ఢీ : ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల కేంద్రంలోని కడప-చెన్నై హైవేపై హైదరాబాదు నుంచి తిరుమల వెళ్తున్న కారు బైక్‌ను ఢీకొన్న సంఘటన సోమవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే.. హైదరాబాదు నుంచి తిరుమల వెళుతున్న కారు హఠాత్తుగా వచ్చిన బైకును ఢీ కొట్టి పక్కనే ఉన్న అక్క, తమ్ముడుని ఢీకొట్టింది. ద్విచక్ర వాహనంపై ఉన్న చెర్లోపల్లి గ్రామానికి చెందిన సుదర్శన్‌రెడ్డి చేయి, కాలు విరగడంతో పోలీసుల సాయంతో 108 వాహనంలో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. నూతన సంవత్సరం పురస్కరించుకొని రెడ్డిపల్లె ఎస్‌టి కాలనీకి చెందిన భోజగం పవన్ కళ్యాణ్ తన అక్కతో కలిసి చెప్పులు తీసుకోవడానికి పుల్లంపేటకు రాగా రోడ్డు దాటడానికి సిద్ధంగా ఉన్న అక్క తమ్ముడిని కారు ఢీకొట్టింది. తలకు తీవ్ర గాయమైన పవన్ కళ్యాణ్‌ను రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రఘురాం తెలిపారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-ములకలచెరువు

మొదటి భార్య చనిపోవడం, ఉన్న భార్య వెళ్లిపోవడంతో ఒంటరిగా జీవించలేక జీవితం విరక్తి చెందిన డేరంగుల రామంజులు రైల్వేస్టేషన్ వద్దకు వెళ్లి రైలు కిందపడి బలవర్మనణానికి యత్నించాడు. కదిరి రైల్వే ఎస్ఐ రహీం, బాధితుని కుటుంబీకుల కథనం మేరకు... మండలంలో పెద్దపాలెం గ్రామం, అంగజాలవారిపల్లికి చెందిన రామాంజులు మొదటి భార్య చనిపోయింది. ఆ తరువాత మరో యువతిని పెళ్లి చేసుకున్నా ఆమె ఎంతో కాలం కలసి జీవించలేదు. రామంజులు ఒంటరివాడై పోయాడు. కూలి పనులతో జీవిస్తున్న రామాంజులుకు గతం గుర్తుకు రావడంతో తీవ్ర మనస్థాపం చెంది జీవితంపై విరక్తి చెందాడు. సోమవారం ఊరికి సమీపంలోని పెద్దపాలెం రైల్వే స్టేషన్ వద్దకు వెళ్లి రైలు కిందపడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా స్టానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. కదిరి రైల్వే ఎస్ఐ రహీంకు తెలియజేసి శరీరం నుంచి వేరైన చేతిని, క్షతగాత్రుని చికిత్స కోసం 108 వాహనంలో మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రి అత్యవసర విభాగం డాక్టర్లు రామాంజులకు మెరుగైన వైద్యం అందించిన అతని ఆరోగ్యం కుదుట పడకపోవడంతో వెంటనే తిరుపతి రుయా ఆసుపత్రికి వెళ్లాలని సూచించగా తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.